సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 27 । ఆగస్టు । 2023



వైద్య శిబిరం తనిఖీ

దిగసంపలు ఆదివాసీ గ్రామంలో శనివారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా తనిఖీ చేశారు. 8లో



రోడ్ల నిర్మాణంతోనే అభివృద్ధి

రోడ్ల నిర్మాణంతోనే గ్రామాల అభివృద్ధి ముడిపడి ఉందని ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు. 8లో



మూడు రోజుల్లో ఓటర్ల సర్వే పూర్తి

రంపచోడవరం నియోజకవర్గంలో మూడు రోజుల్లో ఓటర్ల సవరణ సర్వే పూర్తవుతుందని సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ రవిబాబుకు అభినందనలు



ఎమ్మెల్సీ రవిబాబు దంపతులను అభినందిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ కుంభా రవిబాబును వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షురాలు,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి శనివారం విశాఖలో మర్యాదపూర్వకంగా కలిశారు.డాక్టర్ రవిబాబు దంపతులకు పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షురాలిగా రెండవసారి నియమితులైన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని ఎమ్మెల్సీ రవిబాబు దంపతులు శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

కొనసాగుతున్న వరద

దేవీపట్నం: మండలంలోని పూడిపల్లి పంచాయితీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద గోదావరి వరద కొనసాగుతోంది. ఎగువప్రాంతాల నుంచి వర ద నీరు లేనప్పటికీ స్థానికంగా కురుస్తు న్న వర్షాలకు కొండవాగుల నీరు భారీగా చేరుతోంది. అమ్మవారి విగ్రహం ఇప్పటికీ వరద నీటిలోనే మునిగిఉంది. ఆల యం వద్ద వరద ప్రమాదకర పరిస్థితి ఉండడంతో అమ్మవారి ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. వరద పరిస్థితులు తగ్గిన తరువాత ఆలయం తెరిచే వరకు భక్తులెవరూ రావొద్దని ఆలయ ఈవో జీవీ లక్ష్మీకుమార్ తెలిపారు. దండంగి వైపు నుంచి పోశమ్మగండికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిపై వరద నీరు చేరడంతో దాదాపు 40 రోజుల నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణతో కల్యాణం నిర్వహించారు.

బొర్రా గుహలకు పెరిగిన తాకిడి

- రైళ్ల రద్దు చేసినా వస్తున్న పర్యాటకులు



గుహల సందర్శనకు వచ్చిన పర్యాటకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు తాకిడి పెరిగింది. గత మూడువారాలుగా అంతంతమాత్రంగా ఉండగా.. శనివారం నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ప్రస్తుతం కేకేలైన్‌లోని రెండోలైన్ పనులు జరుగుతుండడంతో గత కొద్దిరోజులుగా కిరండూల్ పాసింజర్ రైలును రద్దుచేశారు. దీంతో పర్యాటకులు తాకిడి తగ్గింది. ఈ నేపథ్యంలో ప్రైవేటు వాహనాలు, బస్సుల్లో మన్యం అందాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. దీంతో గుహలు ప్రాంగణం పర్యాటకులతో సందడిగా మారింది.

అమ్మవారికి బంగారు మంగళసూత్రాల వితరణ

సీలేరు: ఘాట్‌రోడ్డులో కొలువైన ధారాలమ్మతల్లి ఆలయానికి తుని ప్రాంతానికి చెందిన భక్తుడు అరతులం బంగారు మంగళసూత్రాలను అందజేశారు. దంపతులు వి.నూకరాజు, మంగమ్మ శనివారం అమ్మవారిని దర్శించుకుని మంగళ సూత్రాలను ఆలచ అర్చకుడు ప్రసాద్‌కు అందజేశారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

బుసకొడుతున్నాయి..
జాగ్రత్త సుమా!

జిల్లా పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో గిరి రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉంటారు. అటవీ ప్రాంతంతో కలిసి ఉన్నందున విష సర్పాల ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. రైతులు ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా పాముకాటుకు గురై ప్రాణాపాయ స్థితికి చేరే పరిస్థితులు ఎక్కువగా ఉంటాయి. గత రెండేళ్లలో అధికార గణాంకాలను పరిశీలిస్తే పాముకాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది.



పాముకాటు బాధితుల వివరాలు

సంవత్సరం	బాధితులు	మృతులు
2022	112	8
2023	147	11

- వానాకాలంలో సర్పాలతో పొంచి ఉన్న ప్రమాదం
- రెండేళ్లలో 259 మందికి పాము కాటు
- 19 మంది మృతి

ముంచంగిపుట్టు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పచ్చిక పెరుగుతున్న నేపథ్యంలో ఈ సీజన్‌లో విష సర్పాల బెడద ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు గతంలో పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గాయాలపాలైన వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. గ్రామీణ,గిరిజన ప్రాంతాల్లో జూన్ నెల మొదలు సెప్టెంబర్ నెలాఖరు వరకు పాములు, ఇతర విష కీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. వీటి విషయంలో ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రాణాలకు మీదకు తెచ్చుకున్నట్లే.

గిరిజన ప్రాంతంలో సంచరించే పాముల్లో నాగు, తాచు, కట్లు ,రక్తపింజరి రకాల పాములు ప్రమాదకరమైనవి. ఇవి కాటేస్తే రెప్పలు వాలిపోవడం, మింగుడు పడకపోవడం, కాళ్లు చేతులు సీరసించడం, ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుంది. కిడ్నీలపై ఎక్కువ ప్రభావం ఉంటుంది. పాము కాటు గురైన వెంటనే ఏఎస్‌వీ వ్యాక్సిన్ వేయాలి. ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటే వెంటిలేటర్‌పై శ్వాస అందించాలి.



ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్న పాము కాటు బాధితుడు (ఫైల్)

ఇలా వద్దు..

పాము కాటు వేయగానే కొందరు ఆ గాయాన్ని మరింతగా కోస్తే రక్తంతో పాటు విషం వచ్చేస్తుందని కత్తి, బ్లేడ్లతో గాటు పెడతారు. ఇలా చేయడం వల్ల ఒక్కోసారి పాముకాటు కన్నా ఈ గాయం ప్రమాదకరంగా మారవచ్చు. సాధ్యమైనంత త్వరగా శాస్త్రీయమైన చికిత్స అందించడమే ఉత్తమం.

– మరికొందరు పాముకాటు ప్రదేశంలో నోటితో గాటు పెట్టి విషం పీల్చేస్తామంటారు. పాముకాటు వేయగానే విషం రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు, గుండెకు చేరుకుంటుంది. దీనివల్ల ప్రయోజనం ఉండదు. కొంతమంది ఆకు పసర మందులు వాడుతారు. దీనివల్ల ప్రయోజనం ఉండదని వైద్యులు సూచిస్తున్నారు.

ఆందోళన వద్దు

పాముకాటుకు గురైన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు సూచిస్తున్నారు.ఆందోళన చెందితే గుండెపోటుకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రథమ చికిత్సలో భాగంగా పాము కాటు వేసిన చోట కట్టు వేయాలి. వెంటనే దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. కాటు వేసిన ప్రదేశంలో పాము కోరల గాయం స్పష్టంగా కనిపించి, నొప్పి తీవ్రంగా ఉంటుంది. నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది. పాక్షిక పక్షపాతం వల్ల నాలుక మందమైనట్లు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లు గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్తవచ్చు.కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

కట్లపాము: కాటేసిన క్షణాల్లోనే విషం రక్తకణాల్లో కలుస్తుంది. వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి.

నాగుపాము: ఇది కాటేసిన 15 నిమిషాల్లో శరీరంలోకి విషం ఎక్కుతుంది. వెంటనే ఆస్పత్రికి తరలించాలి.

రక్తపింజర: ఇది కాటేసిన రెండు గంటల తర్వాత విషం శరీరంలోకి ఎక్కుతుంది. వెంటనే అప్రమత్తం కావాలి.

జెర్రిపోతు: ఇది కాటేసినా ప్రమాదం ఉండదు. కానీ ఆస్పత్రిలో చికిత్స అవసరం.

అందుబాటులో వ్యాక్సిన్లు



పాము కాటు బాధితులకు ఏఎస్‌వీ ఇంజక్షన్లు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయి.పాము కాటుకు గురైతే వెంటనే ఆస్పత్రికి తీసుకురావాలి. పాము కరిచిన చోట ఒకటి లేదా రెండు గాట్లు ఉంటే అది విషపూరితంగా గుర్తించాలి. అంతకంటే ఎక్కువగాట్లు ఉంటే విషరహిత పాములుగా గుర్తించాలి. విషపూరిత పాము కరిస్తే వెంటనే రక్తం వస్తుంది. ఆరు గంటల వరకు ప్రమాదం లేదు. వెంటనే ఆస్పత్రికి తీసుకురావాలి.వ్యవసాయ పనులు చేసే రైతులు నిత్యం అప్రమత్తంగా ఉండాలి.

– జమాల్‌బాషా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, పాడేరు

జెన్‌కోలో టెండ'రింగ్'

- కాంట్రాక్టర్ల చేతివాటం
- పనులకు బహిరంగంగా పాట నిర్వహణ
- ప్రభుత్వ ఆదాయానికి గండి

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు టెండర్లలో కాంట్రాక్టర్లు చేతివాటం చూపారు. జెన్ కో ఆదాయానికి గండి కొట్టారు. ఏపీ జెన్‌కో సీలేరులో శనివారం నిర్వహించిన పలు పనుల టెండర్లకు సంబంధించి కాంట్రాక్టర్లు అందరూ రింగ్ అయ్యారు. జెన్‌కో కాలనీలో నిర్వహణ పనులు రూ.6.42 లక్షలు, జెన్ కో ఆధ్వర్యంలో నడుస్తున్న డీఏవీ పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.9.72 లక్షలతో జెన్‌కో టెండర్లు పిలిచింది. దీనికి సంబంధించిన టెండర్లను జెన్‌కో కార్యాలయం వద్ద ప్రదర్శించారు. ఏపీ జెన్‌కో రిజిస్ట్రేషన్ ఉన్న కాంట్రాక్టర్లు టెండరు షెడ్యూల్ తీసుకున్నారు. మరింత ఎక్కువ లాభాన్ని పొందేందుకు కాంట్రాక్టర్లు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. దీనిలో భాగంగా శనివారం ఉదయం అందరూ సమావేశమై జెన్‌కో కాలనీ నిర్వహణ పనులకు రూ.1.70 లక్షలు, డీఏవీ పాఠశాల నిర్వహణకు రూ.1.13 లక్షలకు ఇద్దరు కాంట్రాక్టర్లు బహిరంగంగా పాట పాడుకున్నారు. ఈ మొత్తాన్ని టెండర్లకు హాజరైన కాంట్రాక్టర్లంతా పంచుకోవాలని నిర్ణయించారు. అనుకూలమైన ధరను నిర్ణయించుకుని ఇద్దరు కాంట్రాక్టర్లు మాత్రమే టెండర్లు వేసి ఎస్ఈ కార్యాలయానికి అందజేశారు. ఈ మొత్తం వ్యవహారంలో జెన్‌కోకు లాభం రాకపోగా ఎక్కువ నష్టం కలిగింది. దీనిపై ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రశాంత్ కుమార్‌ను వివరణ కోరగా కాంట్రాక్టర్లు రింగ్ అయిన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. దీనిపై విచారించి జెన్‌కోకు నష్టం లేకుండా చూస్తామని ఆయన పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు
- రాష్ట్రస్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ సాంస్కృతిక సంబరాలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

అరకులోయ రూరల్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు పేర్కొన్నారు. మండలంలోని యండపలివలస ఏకలవ్య పాఠశాల ప్రాంగణంలో శనివారం రాష్ట్రస్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ నాలుగవ సాంస్కృతిక సంబరాలను స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు, సంగీతం, నృత తదితర రంగాల్లో కూడా రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఏకలవ్య పాఠశాలలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ విద్యార్థులు ఏదొక రంగానికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో పోటీపడాలని సూచించారు. గిరిజన ప్రాంతంలో ఎంతోమంది మంచి నైపుణ్యం కలిగిన ఉన్నత విద్యావంతులు ఉన్నారన్నారు. మనలో అంతర్లీనంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలని సూచించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఒక్కరూ అన్ని రంగాల్లో రాణించేందుకు అవసరమైన సహకారం అందిస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈఎంఆర్ఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రమణమూర్తి మాట్లాడుతూ అన్నివర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో 1998లో ఏకలవ్య మోడల్ స్కూళ్లు ప్రారంభమయ్యాయన్నారు. అప్పటి నుంచి విద్య అందిస్తూనే విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామన్నారు. ఏటా ఇటువంటి సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తూ విద్యార్థులను ఆటపాటల్లో కూడా చైతన్య వంతులను చేస్తున్నామన్నారు. క్రీడా సంబరాల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 28 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు ఎస్టీ కమిషన్ సభ్యులు తెడబారికి లిల్లీ, రామలక్ష్మి, జెడ్పీటీసీ శెట్టి రోషిణి, ఎంపీపీ ఉషారాణి, ఏకలవ్య పాఠశాలల ప్రిన్సిపాళ్లు మూర్తి, సన్యాసినాయుడు, భాస్కర్రావు, ప్రభాకర్, సర్పంచ్ సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఘన విజయమే లక్ష్యం

- భారీ మెజారిటీతో అభ్యర్థుల గెలుపునకు కృషి
- పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



సాక్షి,పాడేరు: జిల్లాలో పార్టీ మరింత బలోపేతమే లక్ష్యమని, 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల భారీ మెజారిటీతో విజయమే ధ్యేయంగా కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా రెండవసారి నియమించడంపై శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తనపై ఎంతో నమ్మకంతో రెండవసారి నియమించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. జిల్లా నూతన కార్యవర్గంలో అన్ని ప్రాంతాలకు చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించారన్నారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని అరకులోయ, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల్లో పార్టీ సమావేశాలతోపాటు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తామన్నారు.సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమైందన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని గ్రామస్థాయిలో మరింత విస్తృత ప్రచారం చేస్తామన్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అన్ని వర్గాల నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు.

విస్తారంగా వర్షాలు

- జిల్లా వ్యాప్తంగా 439 ఎంఎం వర్షపాతం
- అత్యధికంగా అడ్డతీగల, అత్యల్పంగా జి.మాడుగులలో నమోదు



పాడేరులో కురుస్తున్న వర్షం

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. రైతులంతా వర్షాల కోసం ఎదురుచూస్తున్న సమయంలో వరుణుడు కరుణించాడు. గెడ్డలు,వాగులలోను వరద ఉధృతి నెలకొంది. పోలవరం ముంపు మండలాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రంతా వర్షం కురుస్తూనే ఉంది. శనివారం ఉదయం నుంచి జిల్లాలో అనేక చోట్ల భారీ వర్షం కురిసింది. పాడేరులో మాత్రం మోస్తరు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 439 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అడ్డతీగలలో 62.4, కూనవరంలో 50.8, వీఆర్‌పురంలో 42.6, గంగవరంలో 34.6, ఎటపాకలో 32.6, కొయ్యూరులో 27.2, పెదబయలులో 23.6, జి.కే.వీధిలో 22.2, ముంచంగిపుట్టులో 19.8, దేవీపట్నంలో 17.4, మారేడుమిల్లిలో 16.2, చింతపల్లిలో 15.6, పాడేరులో 14, వై.రామవరంలో 12.6, చింతూరులో 9.4, హుకుంపేటలో 8.2, రాజవొమ్మంగిలో 7.6, రంపచోడవరంలో 6, అనంతగిరిలో 5.4, డుంబ్రిగుడలో 4.4, అరకులోయలో 3.2, జి.మాడుగులలో 3.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంత బోసి పోయింది. కొనుగోలుదారులు రాకపోవడంతో లావాదేవీలపై ప్రభావం చూపింది. దోడిపుట్టు, వనభసింగి, పేటమాలిపుట్టు, గూడమాలిపుట్టు గ్రామాల నుంచి గిరిజన రైతులు అధికంగా కూరగాయలు తీసుకువచ్చారు. అమ్మకాలు జరగక తీవ్రంగా నష్టపోయారు.

మందలించాడన్న ఆగ్రహంతో..

- తండ్రిపై కర్రతో కొడుకు దాడి
- తీవ్రంగా గాయపడి మృతి



లక్ష్మయ్య మృతదేహం

చింతూరు: మందలించాడనే ఆగ్రహంతో ఓ తనయుడు తండ్రిని హతమార్చిన ఘటన చింతూరు మండలం లంకపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పాడియం లక్ష్మయ్య(40) కుమారుడు అర్జున్ వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడు వాదోడుగా ఉండకుండా బయట పనులకు వెళ్తున్నాడు. దీనిపై ఆగ్రహించిన లక్ష్మయ్య ఇంటివద్దనే ఉండి వ్యవసాయ పనులు చూసుకోవాలని కొడుకును మందలించాడు. దీంతో అర్జున్ ఆగ్రహంతో కర్రతో తండ్రి తలపై కొట్టడంతో అతను మృతిచెందినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై
ఉచిత అవగాహన సదస్సు

- సెప్టెంబర్ 3వ తేదీ ఉదయం 9 నుంచి 12.30 వరకు..
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్‌తో కలిసి సెప్టెంబర్ 3వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విశాఖలోని రామాటాకీస్ దరి రీజనల్ కంటి ఆస్పత్రి ఎదురుగా గల డా.బి.ఆర్.అంబేడ్కర్ భవన్‌లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్ 2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం.. దీనికి తోడు గ్రూప్–2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనుంది. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

వేదిక:
డా.బి.ఆర్.అంబేడ్కర్ భవన్,
రామాటాకీస్ దరి రీజనల్
కంటి ఆస్పత్రి ఎదురుగా విశాఖపట్నం

సమయం :
ఉదయం 9 నుంచి 12.30 వరకు

వివరాలు పంపించాల్సిన ఫోన్ నెంబర్ 8985094499

బస్సు ప్రమాద బాధితులకు పరామర్శ


బాధితుడిని పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: ఇటీవల పాడేరు ఘాట్‌లో ఆర్టీసీ బస్సు లోయలో పడిన ప్రమాద సంఘటనలో తీవ్రంగా గాయపడి విశాఖలోని మెడికవర్ ఆస్పత్రిలో ఉన్నత వైద్యసేవలు పొందుతున్న బాధితులను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పరామర్శించారు. శనివారం ఆమె ఆస్పత్రి వైద్యులతో బాధితుల ఆరోగ్య పరిస్థితిపై మాట్లాడారు. సకాలంలో ఉన్నత వైద్యం అందడంతో కిల్లో బోడిరాజు,బొట్ట చిన్నమ్మలకు ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారని ఎమ్మెల్యే చెప్పారు. పూర్తిగా కోలుకునేంతవరకు ఉన్నత వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరినట్టు ఆమె వివరించారు. బాధితులు బోడిరాజు, చిన్నమ్మలను కూడా ఆమె పరామర్శించారు.

మూడు రోజుల్లో ఓటర్ల సవరణ సర్వే పూర్తి

రంపచోడవరం: నియోజకవర్గంలో ఇప్పటి వరకు 61 శాతం డోర్ టు డోర్ ఓటర్ల సర్వే పూర్తయినట్లు రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. ఆయన కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రీ రివిజన్ యాక్టివిటీస్–2024లో భాగంగా ఇంటింటి ఓటర్ల సర్వే, తొలగించబడిన ఓటర్ల విషయం, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సూచనలపై ఆయన నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి ఓటర్ల మరో మూడు రోజుల్లో నూరుశాతం పూర్తవుతుందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నుంచి ఎం.ఈశ్వరరావు, సీపీఎం నుంచి బి.రాంప్రసాద్, బీజేపీ నుంచి ఎస్.బొజ్జిరెడ్డి, కాంగ్రెస్ నుంచి చుక్కా సంతోష్‌కుమార్, టీడీపీ తరఫున పి.అనంతమోహన్, ఎన్నికల డీటీ ఎస్‌వీవీ సత్యనారాయణ, సీనియర్ సహాయకులు లక్ష్మణరావు, ఇందిరాబాయి పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశాలు



అనంతగిరి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి నీలవేణి


కొయ్యూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్, పక్కన జెడ్పీటీసీ నూకరాజు

అనంతగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి కొంతమంది అధికారులు గైర్హాజరైన వారిస్థానంలోని క్షేత్రస్థాయి సిబ్బందిని సమావేశాలకు పంపుతున్నారని, సభ్యులు మండిపడ్డారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపాలని, ఎంపీపీ శెట్టి నీలవేణిని ఎంపీడీవో కుమార్‌ను సూచించారు. రైతులకు పంపిణీ చేస్తున్న రాజ్‌మా విత్తనాలు సక్రమంగా అందే విధంగా చూడాలని, అలాగే నాడు–నేడులో పాఠశాలలోని జరిగిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, మృతి చెందిన పశువులకు రైతులకు నష్టపరిహారం అందేవిధంగా కృషిచేయాలని సభ్యులు కోరారు. వైస్ ఎంపీపీలు శకుంతల, జయవర్ధిని, జెడ్పీటీసీ గంగరాజు, కో–ఆప్షన్ సభ్యుడు మదీనా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బడుగు రమేష్ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. గృహ నిర్మాణాలకు సంబంధించి సిమెంట్ సరఫరాపై అధికారుల తీరుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ ఈ విషయంపై అధికారులు స్పందించాలన్నారు. డౌనూరులో ఇద్దరు వైద్యులు ఉన్నా ఒక్కరు కూడా సమావేశానికి రాకపోవడంపై అసంతృప్తి చెందారు.రేవళ్ల పాఠశాలను తెరిపించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఏటీడబ్ల్యువో క్రాంతికుమార్‌ను కోరారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ కార్యదర్శికి సమాచారం తెలియజేశామన్నారు. కన్నంపేటలో రైతులకు ఇచ్చిన ఆర్వోఎఫ్ఆర్ భూముల్లో రైతులను అటవీశాఖాధికారులు అనుమతించడం లేదని పలువురు సభ్యులు తెలిపారు. దీనిపై కొయ్యూరు సెక్షన్ అధికారి సింహాద్రి సమాధానం చెప్పలేదు.ఎద్దుమామిడికి రోడ్డు పనులను అటవీ శాఖ అభ్యంతరం చెప్పడం సరికాదని ఎంపీపీ సహా అనేక మంది సభ్యులు తప్పుపట్టారు. కంఠారం పీహెచ్‌సీలో వైద్య సేవల సక్రమంగా అందడం లేదని పలువురు సభ్యులు చెప్పారు. అన్ని రకాల ధ్రువ పత్రాలు అందజేయాలని పలువురు కోరారు. ఎంపీడీవో సీతయ్య, జేఈ రామకృష్ణ, డీటీ సీతారాం, ఏవో ఉమాదేవి, ఆర్అండ్‌బీ జేఈ ప్రసాద్ పాల్గొన్నారు.

గంజాయి అనర్థాలపై అవగాహన


గాదిగుంటలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రశాంత్

జి.మాడుగుల: గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, గిరిజన రైతులు గమనించి ప్రత్యామ్నాయ పంటల పట్ల దృష్టి సారించాలని అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రశాంత్‌కుమార్ కోరారు. మండలంలో నుర్మతి పంచాయతీ ఎస్.కొత్తూరు, పినగరువు, జీలుగులగొయ్యి, చెరువువీధి, కర కదాటు, గాదిగుంట, డిప్పలగొంది, మద్దివీధి, పినజాగేరు గ్రామాల్లో శనివారం వ్యవసాయ శాఖ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గంజాయి అనర్థాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణాలో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు. పోలీస్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంతోనే అభివృద్ధి

అడ్డతీగల: రోడ్ల నిర్మాణంతోనే గ్రామాల అభివృద్ధి ముడిపడి ఉందని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి,ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు. మండలంలోని మూడు చోట్ల రూ.5.40 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు వివిధ పథకాల నుంచి నిధులు వెచ్చించి అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, ఎంపీటీసీ పల్లాల విశ్వకుమారి,చెక్కా అచ్చియ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో వైద్య శిబిరం తనిఖీ


వైద్య శిబిరంలో చిన్నారిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

సాక్షి,పాడేరు: మండలంలోని ఇరడాపల్లి సబ్‌సెంటర్ పరిధిలోని మారుమూల దిగసంపలు ఆదివాసీ గ్రామంలో శనివారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా తనిఖీ చేశారు. బైక్‌పై కొంతదూరం వెళ్లిన ఆయన అక్కడి నుంచి కాలినడకన గ్రామానికి వెళ్లారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఆదివాసీలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కాచిచల్లార్చిన నీటిని సేవించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారికి డీఎంహెచ్‌వో సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పద్మకుమారి, గణేష్‌నంద, వైవీ రమణ,ఆశా,అంగన్‌వాడీ కార్యకర్తలు కమలమ్మ, సింగారి పాల్గొన్నారు.

ఉచితంగా సత్యదేవుని సామూహిక వ్రతాలు


కారుకోడ పూజ

రంపచోడవరం: హిందూ ధర్మప్రచార నిమిత్తం గిరిజన ప్రాంతంలో శ్రీ వీర వెంకటసత్యనారాయణ స్వామివారి సామూహిక వ్రతాలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు అన్నవరం దేవస్థానం పాలకమండలి డైరెక్టర్ కారుకోడి పూజ తెలిపారు. మైదాన ప్రాంతంలో స్వామివారి వ్రతాలు ముగిసిన తరువాత ఏజెన్సీలో 28 నుంచి ప్రారంభమవుతాయన్నారు. 28న రంపచోడవరం చేరుకుని సంత మార్కెట్ వద్ద, పరిసర గ్రామాల్లో స్వామివారి సత్యరథంతో పర్యటించి స్వామివారి వ్రతం, అన్నవరం దేవాలయ విశిష్టతలను ప్రచారం చేస్తారన్నారు. రంపచోడవరంలో 29న ద్వారక తిరుమల దేవస్థానం దత్తత దేవాలయం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామివారి సామూహిక వ్రతాలు నిర్వహిస్తారన్నారు. రెండవ తేదీన రంపచోడవరం నుంచి బయలుదేరి పెద్దగెద్దాడ, చిన్నగెద్దాడ, దేవరపల్లి మీదుగా మారేడుమిల్లి చేరుకుని సంత మార్కెట్, గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. మారేడుమిల్లిలో ఎనిమిదవ తేదీన స్వామివారి వ్రతాలు నిర్వహిస్తారని, 9న మోతుగూడెం, 16న చింతూరులో, 23 కుంట గ్రామం, 24న కూనవరంలో సామూహిక వ్రతాలు నిర్వహిస్తారని ఆమె పేర్కొన్నారు.

ఒకే రోజు రెండు పల్సర్ బైక్‌ల చోరీ

- ఒక బైక్‌లో పెట్రోల్ అయిపోవడంతో మరో బైక్ చోరీ
- సీసీ ఫుటేజ్‌ను పరిశీలించిన పోలీసులు
- మన్యంలో పోలీసులకు సమాచారం

కొయ్యూరు : మండలంలోని ఒకే రోజు రెండు పల్సర్ బైక్‌లు చోరీకి గురైన సంఘటన చోటు చేసుకుంది. ఆయా సంఘటనలో ఒక బైక్‌ను దొంగ వదిలిపెట్టాడు. శుక్రవారం అర్ధరాత్రి మర్రివాడలో మాజీ ఎంపీపీ గొలిసింగి సత్యనారాయణకు చెందిన పల్సర్ బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు. దానిని రాజేంద్రపాలెం వరకు తీసుకువచ్చాడు. గుడ్లపల్లి జంక్షన్ వద్దకు రాగానే పెట్రోల్ అయిపోవడంతో దానిని వదిలిపెట్టి రాజేంద్రపాలేనికి చెందిన కిరాణా వ్యాపారి మొల్లేటి అంజికి చెందిన పల్సర్ బైక్‌ను దొంగిలించాడు. ఇంటిగేటు ముందు ఉంచిన వాహనం చోరీకి గురవడంతో శనివారం ఉదయం నుంచి అంజి అనేక ప్రాంతాల్లో వెతికి అనంతరం ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఎస్ఐ రాజారావు శనివారం సాయంత్రం గుడ్లపల్లి జంక్షన్‌లో సీసీ ఫుటేజీని పరిశీలించారు. సీసీ ఫుటేజీ దృశ్యాల్లో గుర్తు తెలియని వ్యక్తి ఒకరు ముందుగా మర్రివాడ ప్రాంతం నుంచి బైక్‌ను తీసుకువచ్చి అక్కడ వదిలిపెట్టిన దృశ్యాలు కనిపించాయి. దీని తరువాత అంజికి చెందిన కొత్త పల్సర్ బైక్‌ను దొంగతనం చేసి పెదవలస మార్గంలో తీసుకుపోయినట్టుగా దృశ్యాలు కనిపించాయి. దొంగను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. చింతపల్లితో పాటు ఇతర ప్రాంతాలల్లో కూడా సమాచారం ఇచ్చారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.